ప్రజాశక్తి
ఆదివారం 21 మే 2023 5 అనంతపురం

సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి)

కూలీలపై చిన్నచూపు

◆ ఉపాధి పని ప్రదేశాల్లో వసతులు కరువు ◆ వేసవిలో ఉపాధి కూలీలకు ఇబ్బందులు

◆ ముళ్ల కంప చెట్లే టెంట్లు... ఇంటి నుంచి తెచ్చుకున్నవే నీరు.. ◆ కనిపించని మెడికల్ కిట్లు

మండుటెండలు తీవ్ర స్థాయి ఉన్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే భానుడి భగభగలుంటున్నాయి. జిల్లాలో 40 డిగ్రీలకుపైగా ఎండలు మండుతున్నాయి. ఇటువంటి సమయంలో మండుటెండల్లో పనిచేసే కూలీలకు పని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన కనీస సౌకర్యాలు ఏవీ కనుచూపు మేరలో కనిపించడం లేదు. ముళ్ల కంపలే టెంట్లు, ఇంటి నుంచి తెచ్చుకున్న లీటరు, రెండు లీటరు బాటిళ్లతోనే ఉపాధి కూలీలు దాహం తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వేసవి ఎండలకు ఎవరికైనా బెట్ట తగిలితే అందించేందుకు ప్రాథమిక కిట్లు కూడా ఏ ఒక్క చోట అందుబాటులో లేవు. ఉపాధి హామీ పనుల పరిశీలనలో భాగంగా శనివారం నాడు ప్రజాశక్తి పలు ప్రాంతాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాల్లోనూ కూలీలకు వసతులు ఏర్పాటు చేయని పరిస్థితులే కన్పించాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా పరిధిలో 3.1 లక్షల జాబ్‌కార్డులున్నాయి. ఇందులో 2.57 లక్షల జాబ్‌కార్డులు యాక్టివ్‌గానున్నాయి. సుమారు 4.62 లక్షల మంది కూలీలు ఉపాధి పథకం కింద పనిచేస్తుంటారు. ఇంత పెద్ద ఎత్తున కూలీలు పనిచేస్తున్నారు. ఉపాధి చట్టం ప్రకారం పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని చెబుతోంది. అయితే జిల్లాలో ఎక్కడా ఈ నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదు. టెంట్లు అన్నవే లేకుండా ఉన్నాయి. పని ప్రాంతాల్లో ముళ్ల కంప చెట్లు ఉంటే వాటి నీడనే ఎండ నుంచి కూలీలు రక్షణ పొందుతున్నారు. బుక్కరాయసముద్రం మండలంలో బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు సుమారు 270 మంది వరకు వీరభద్రస్వామి మాన్యంకు సంబంధించిన గుట్టలో ఫారంపాండ్ తవ్వుతున్నారు. ఇందులో 70 ఏళ్లకుపైగా వృద్ధులు మొదలుకుని 20 ఏళ్ల వయసు వరకున్న వారందరూ పనిచేస్తున్నారు. ఈ ప్రాంతంలో పనిచేసే కూలీలను అడిగితే టెంట్లు ఏవీ లేవని, ప్రభుత్వం అటువంటివేవి ఏర్పాటు చేయలేదని చెప్పారు. మండుటెండలో నీరు ఎలాగంటే ఇంటి నుంచి తెచ్చుకునే లీటరు వాటరు బాటిళ్లే అని చెప్పారు. ఆ చుట్టుపక్కల కిలోమీటరు పరిధిలో ఎక్కడా నీటి దొరికే పరిస్థితి కూడా లేదు. ఇక మెడికల్ కిట్ల అంశం అడిగితే అవేవీ ఇవ్వలేదని టీమ్‌లీడర్ చంద్రకళ తెలిపారు. ఇదే పరిస్థితి సిద్ధరాంపురం గ్రామం పరిధిలో చెరువు పూడిక తీస్తున్న వ్యవసాయ కూలీల పనిప్రదేశంలోనూ కన్పించింది. ఇక్కడ 300 మంది వరకు పనిచేస్తున్నారు. వీరందరూ ఆరు కిలోమీటర్ల దూరం ఉండే కొండాపురం గ్రామం నుంచి ఆటోలో వస్తారు. ఇక్కడా నీడగాని, మెడికల్ కిట్లుగాని, అస్వస్తతకు గురైతే అందించేందుకు ఉండాల్సిన ఓఆర్ఎస్ ప్యాకెట్లుగాని ఏవీలేవు. శింగనమల మండల కేంద్రంలో పనిచేసే వ్యవసాయ కూలీల పరిస్థితి ఇదే తీరున ఉంది. జిల్లాలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ఏ ప్రాంతాన్ని పరిశీలించినా ఇదే పరిస్థితి కన్పిస్తోంది.

ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి

ఉపాధి హామీ చట్టంలో వ్యవసాయ కూలీలకు అన్ని రకాల సౌకర్యాలూ కల్పించాలని చెబుతోంది. గతంలో ఇవి కల్పిస్తూ వచ్చారు. కాని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఇప్పుడు క్రమక్రమంగా అన్నింటినీ తొలగించి వేస్తోంది. జిల్లాలో 40 డిగ్రీలకుపైగా ఎండలున్నాయి. ఇటువంటి సమయంలో జనం బయటకు రావాలంటనే భయపడిపోయే పరిస్థితులు న్నాయి. ఇంతటి ఎండలో పనిచేసే కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కనీస వసతులను పనిచేసే ప్రాంతాల్లో కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం.

కృష్ణమూర్తి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

జిల్లాలో మూడు కొత్త ఇసుక రీచ్‌లు

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో కొత్తగా మరో మూడు ఇసుక రీచ్‌లను గుర్తించి, వాటికి ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పామిడి మండల కేంద్రం, గార్లదిన్నె మండలంలో ఇల్లూరు గ్రామం, కంబదూరు మండలంలో కర్తనపర్తి గ్రామంలో గుర్తించిన బహిరంగ ఇసుక రీచ్‌లకు ఆమోదం తెలిపామన్నారు. ఇందుకు సంబంధించి పర్యావరణ అనుమతులన్నింటినీ త్వరగా తీసుకోవాలని, వీలైనంత త్వరగా ఇసుక తవ్వకాలను చేపట్టాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే సాధ్యమైనంతమేర ఇసుకను నిల్వ ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, తదితర అవసరాలకు ఇసుక కొరత రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సెబ్, మైనింగ్ అధికారులు క్రమం తప్పకుండా ఇసుకరీచ్‌ల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లో జిల్లాలోని ఇసుక రాష్ట్ర సరిహద్దులు దాటకుండా తగినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ శాఖ అధికారి జి.వెంకటేశ్వర్లు, తాడిపత్రి డివిజనల్ అధికారి నాగయ్య, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, డిపిఒ ప్రభాకర్ రావు, ఐబి డివిజన్ ఈఈ సి.ప్రతాప్, సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ ఇ.నరసానాయుడు, ఆర్టీవో బి.సురేష్ నాయుడు, పొల్యూషన్ బోర్డ్ అధికారి శంకరరావు, అసిస్టెంట్ జియాలజిస్ట్ రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిఎఫ్‌సి భవనాలను సకాలంలో పూర్తి చేయండి

జిల్లాలో నిర్మిస్తున్న ఎంపిఎఫ్‌సి భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి బహుళ ప్రయోజన సౌకర్య కేంద్రాల (ఎంపిఎఫ్‌సి) భవన నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి దశలో వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో గుర్తించిన 24 గోడౌన్లలో రెండు గోడౌన్లు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలినవి వెంటనే పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, ఇంజినీర్లను ఆదేశించారు. రెండవ దశలో మంజూరు చేసిన 61 గోడౌన్ల నిర్మాణాలకు టెండర్లను పిలిచామని, వాటికి సంబంధించి కూడా త్వరితగతిన సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సకాలంలో గోడౌన్లు నిర్మించాలన్నారు. అ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, జిల్లాకో-ఆపరేటివ్ అధికారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్, ఇన్‌ఛార్జి ఉద్యాన శాఖ డిడి రఘునాథరెడ్డి, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, ఎడిసిసిబి సీఈవో రాంప్రసాద్, నాబార్డ్ మేనేజర్ కె.అనురాధ, కెడిఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టర్ వెంకట నాగిరెడ్డి, మార్కెటింగ్ శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రూ.100 స్టాంప్ పేపర్ల కొరత

రిజిస్ట్రేషన్లకు అవస్థలు - వినియోగంలో ఈ స్టాంపులు

ప్రజాశక్తి-అమడుగూరు

రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్టాప్ పేపర్ల కొరత తీవ్రం అవుతోంది. ఒకరంగా స్టాంప్‌పేపర్లు భవిష్యత్తులో కనుమరుగు అవుతాయన్న విధంగా చర్చ నడుస్తోంది. రూ.100 విలువ గల జుడీషియల్ స్టాంపులు ఇటీవల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదు. కార్యాలయంలో ఇవి లేకపోవడంతో బయట దళారులు వాటిని ఏదో రూపంలో తెచ్చుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వంద రూపాయల స్టాంపులను రూ.500కు విక్రయిస్తున్నారు. ఒక్కా సారిగా ప్రభుత్వం 100 రూపాయల స్టాంపుల సరఫరా నిలిపేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం వీటి స్థానంలో ఈ స్టాంపులను వినియోగించాలని ఆదేశాలు ఇచ్చింది. వీటి గురించి పెద్దగా అవగాహన లేని ప్రజలు వాటిని తెచ్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 100 రూపాయల స్టాంపులు కోసం నిత్యం వందలాది మంది మంది ప్రదక్షిణలు చేస్తుంటారు. ఈ స్టాంపులు పైనుంచి రావడం లేదంటూ అధికారులు పేర్కొంటున్నారు.

రూ.100 స్టాంప్‌లు రావడం లేదు...

గత కొంతకాలంగా రూ.100 రిజిస్ట్రేషన్ స్టాంపులు రావడం లేదని కదిరి సబ్ రిజిస్ట్రార్ శిరీష భరత్ తెలిపారు. కార్యాలయంలో ఇప్పటి వరకు స్టాకు ఉన్న 100 రూపాయల స్టాంపులను ఇచ్చేశామన్నారు. కార్యాలయం అవసరానికి అనుకూలంగా కొద్దిగా ఉండొచ్చని, వాటిని కూడా ప్రజలకు ఇచ్చేస్తామన్నారు. గత కొన్ని రోజుల క్రితమే వంద రూపాయల స్టాంపులు కావాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. అయితే అవి నేటికీ రాలేదన్నారు. ప్రజలు కూడా సులుభమైన ఈ స్టాంపు విధానంను అలవాటు చేసుకోవాలని సూచించారు. కదిరి పట్టణంలో ఈ స్టాంపు వినియోగించేలా మీసేవా కేంద్రాలకు అనుమతులు ఇచ్చామన్నారు. పూర్తిస్థాయిలో ఈ స్టాంపు వినియోగంలోకి వస్తే ప్రజలు, అధికారులకు ఇబ్బందులు ఉండవు. నాన్ జుడీషియల్ స్టాంపులు ఏ విధంగా విక్రయిస్తున్నారో ఈస్టాంపు విధానాన్ని కూడా స్టాంపు వెండర్లు విక్రయించుకోవచ్చునని సూచించారు. వీటిని ఎవరైనా కతిమ కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పనులు చేయాలంటే

చాలా కష్టంగా ఉంది సారూ..

సిఐటియు నాయకులకు 'ఉపాధి' కూలీల మొర

ప్రజాశక్తి-గార్లదిన్నె

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు జి.ఓబులు

'ఎండలు మండి పోతున్నాయి.. పనులు చేసే చోట సౌకర్యాలు లేవు..పనిముల్లు లేవు.. పనులు చేయాలంటే చాలా కష్టంగా ఉంది సారూ..' అంటూ సిఐటియు నాయకుల ఎదుట ఉపాధి కూలీలు వాపోయారు. శనివారం మండల పరిధిలోని కోటంక గ్రామంలో ఉన్న నడిమి గుట్ట వద్ద చేపట్టిన ఉపాధి పనులను సిఐటియు నాయకులు పరిశీలించి కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై కూలీలు లబోదిబోమన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఉపాధి హామీ పని దినాలు తగ్గించారన్నారు. కూలి రేట్లు కూడా రూ.వంద నుంచి రూ.150 లోపే ఉంటోందన్నారు. అలాగే గతంలో ఇస్తున్న గడ్డపార్లు, పారలు ప్రస్తుతం ఇవ్వడం లేదన్నారు. అదేవిధంగా గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరం పనికి వెళ్లే వారికి ఆటో ఛార్జీలు ఇవ్వడం లేదన్నారు. అలాగే వేసవి అలవెన్స్ ఇవ్వడం లేదన్నారు. ఇకపోతే మరీ ముఖ్యంగా పనికి వచ్చిప్పుడు ఒక ఫొటో, పని అయిపోయిన తర్వాత మరో ఫొటో తీసుకోవాలని తప్పనిసరి చేశారన్నారు. దీనివల్ల చాలా నష్టపోతున్నామన్నారు. ఎందుకంటే వచ్చేటప్పుడు కొంత ఆలస్యంగా వచ్చినా పోయేటప్పుడు ఆలస్యంగా పని చేసుకుని వెళ్తామన్నారు. అలాకాకుండా తప్పనిసరిగా ఫొటో తీసుకోవాలని చెప్పడం చాలా నష్టపోతున్నామన్నారు. దీనికితోడు పని చేసిన జంటలో కొలతలు తీసినప్పుడు ఎవరో ఒకరు ఉంటే చాలు.. అలాకాకుండా అందరూ ఉండాలని చెప్పడం బాధాకరమన్నారు. గతంలో ఎండకు పెద్దలు, పిల్లలు సేద తీర్చు కోవడానికి పట్టలు, మజ్జిగ ఇచ్చేవారని, ఇప్పుడు కనీసం తాగునీటి ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీల పట్ల నిర్లక్ష్యంగా, నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్నాయన్నారు. దీంతో కూలీ చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అలాగే పని దినాలు పెంచాలని, పనితగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనులు చేసే చోట కనీస మౌలిక వసతులు కల్పించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాయకులు నాగమ్మ, మల్లికార్జున, పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నారాయణరెడ్డి, సుధాకర్, సీనా, సుగుణమ్మ, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వభూమి కబ్జా కాకుండా చూడండి

కలెక్టర్‌ను కోరిన సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గార్లదిన్నె మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 456-1, 456-1ఎ4లో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని, దీనిపై కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గార్లదిన్నెలో కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో ప్రయివేటు వ్యక్తులు ప్లాట్లు వేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. గత నెల రోజులుగా గార్లదిన్నె భూమి గురించి జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతున్నా రెవెన్యూ, డివిజన్ అధికారులు ఎందుకు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రశ్నించారు. మాజీ సైనికోద్యోగుల పేర్లతో నకిలీ పట్టాలు సృష్టించి, వాటినే నిజమైన పట్టాలుగా ప్రభుత్వ రికార్డుల్లో రాయించడం వెనుక అధికార పార్టీ ముఖ్య నేతల హస్తం ఉందన్నారు. ఈ ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రికి సిపిఎం విన్నవించినా స్పందన లేదన్నారు. విలువైన భూములు ఇలా కబ్జా అవుతుండడం, అందుకు అధికారులు సహకరిస్తుండడం ఆందోళన కలిగించే అంశం అన్నారు. ఒకవైపు పేదలు ఇళ్ల స్థలాల కోసం రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతుంటే పట్టించుకోకుండా, అక్రమార్కులకు మాత్రం ఎకరాలకు ఎకరాలు అక్రమించుకునేందుకు అధికారులు సహకరించడం విచారకరం అన్నారు. ఈ కబ్జాపై జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. గార్లదిన్నె ప్రభుత్వ భూమిని పేదలకు పంచెందుకు కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన ఉధతం చేస్తామని తెలిపారు.

విత్తన కాయల నాణ్యతలో రాజీపడొద్దు

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం

విత్తనకాయల నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకుంటున్న జెసి కేతన్‌గార్గ్

సబ్సిడీపై రైతులకు పంపిణీ చేసే విత్తన వేరుశన కాయల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలో సబ్సిడీ వేరుశనగ ప్రాసెసింగ్ చేస్తున్న ప్లాంట్లను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రానాయక్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సాగుకు నాణ్యమైన వేరుశనగ కాయలు అందించాలన్నారు. విత్తన పంపిణీ ఈనెల చివర్‌లో ఉంటుందని, అంతలోపు ప్రాసెసింగ్ చేసిన కాయలను మండలాల్లోని రైతు భరోసా కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎపి సీడ్స్ మేనేజర్ ధనలక్ష్మి, అనంతపురం ఏవో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం అనంతపురము రూరల్ మండలం ఎ.నారాయణపురం మసీదు వద్ద వాల ంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహి ంచారు. ఇందులో భాగంగా ప్రతిభ కన బరిచిన వాలంటీర్లకు సేవారత్న పథకా లను అందజేసి ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి పేదవారికీ సంక్షేమ పథకాలు అందించ డమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సిఎం జగన్ సచి వాలయం, వాలంటరీ వ్యవస్థలను తీసుకొచ్చారన్నా రు. ఆయా వ్యవస్థల ద్వారా అవినీతి రహితంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపిపి వరలక్ష్మి ఈశ్వరయ్య, ఎంపిడిఒ బాబా ఫక్రుద్దీన్, విస్తరణ అధికారి అలివేలమ్మ, పంచాయతీ కార్యదర్శులు అశోక్‌బాబు, ముత్యాలరెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు పెంచుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

విద్యార్థులు మూఢ నమ్మకాలవైపు వెళ్లకుండా శాస్త్రీయ ఆలోచనలను పెంచుకోవాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ విద్యార్థి, యువజన రంగాలకు జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి రోజు కార్యక్రమంలో గేయానంద్ మాట్లాడుతూ దేశంలో విభిన్న కులాలు, మతాలు, జాతులు ఉన్నాయన్నారు. వారందరి ఆలోచన విధానం దేశ ప్రగతి, అభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. కానీ ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతం, కులం పేరుతో దేశంలో మత కలహాలను సృష్టించి మారణ హోమం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో మత కలహాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా బావిభారత పౌరులుగా దేశంలో ఉన్న విద్యార్థి, యువత ముందుకు రావాలన్నారు. అలాగే మూఢనమ్మకాలు, మనువాదాన్ని పెంచి పోషించడం కోసం బిజెపి ప్రభుత్వం విద్యారంగంలో జాతీయ నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. వాటన్నింటికీ వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర, డివైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, బాలకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, అధ్యక్షులు శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రమేష్, వంశీ, తరిమెల గిరి, సూర్యప్రకాష్, వెంకీ, అశోక్, విజయ్, రజిత, వర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఎపి ఆర్‌జెసి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఇందులో భాగంగా నగరంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డిఇఒ సాయిరాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఉదయం జరిగిన క్యాట్ ప్రవేశ పరీక్షకు 5747 మందికి 4679 మంది, మధ్యాహ్నం జరిగిన ఎపి ఆర్‌జెసి జెసి, డిసి ప్రవేశ పరీక్షకు 7890 మందికి 6468 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసి గోవింద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎపి ఆర్‌జెసి ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిఇఒ సాయిరాం

వేరుశనగ రైతుకు విత్తు కష్టాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలోనే నూనెగింజెల పంటల సాగులో అనంతపురం జిల్లా అగ్రభాగాన ఉంటుంది. వర్షాభావ పరిస్థితులను తట్టుకుని నిలబడే పంట వేరుశనగ. కొన్ని దశాబ్దాలుగా ఈ పంటనే ఇక్కడ ప్రధానమైనదిగా ఉంటూ వస్తోంది. రాష్ట్రంలో 90 శాతం వేరుశనగ పంట ఒక్క అనంతపురం జిల్లాలోనే పండుతుంది. అయితే ప్రభుత్వాల ప్రోత్సాహకాలు, అంతర్జాతీయంగా వంట నూనెల దిగుబడుల కారణంగా గిట్టుబాటు ధర లేకపోవడం వంటి కారణాలతో పంట సాగు చేసే రైతుకు నష్టాలు మిగులుతున్నాయి. దీంతో ఆత్మహత్యలు సైతం చేసుకుంటున్నారు. దీనిపై దేశవ్యాప్తంగానే చర్చ జరుగుతోంది. అత్యల్ప వర్షపాతమూ, అతి తక్కువ నీటి వసతి ఉన్న ఈ ప్రాంతంలో పండేందుకు అనువైన పంటగా ఇది ఉండటంతోనే రైతులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. ప్రారంభంలో పంట సాగుకు అవసరమైన విత్తనాన్ని ప్రభుత్వం సబ్సిడీతో తక్కువ ధరకు అందిస్తూ ప్రోత్సహిస్తూ వచ్చింది. అయితే పెరిగిన పెట్టుబడులు, గిట్టుబాటు ధరలేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు తరచూ దెబ్బతింటున్న కారణంగా రైతులకు క్రమంగా జిల్లాలో వేరుశనగ సాగుపై ఆసక్తి తగ్గుతూ వస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లలో 23 లక్షల ఎకరాల వరకు సాగెయ్యేది. అలాంటిది ఇప్పుడు 12 నుంచి 13 లక్షల ఎకరాలకు పడిపోయింది. పంటల్లో వరుసగా నష్టాలకు ప్రకృతి వైపరీత్యాలు ఒక ఎత్తవుతే... విత్తన నాణ్యత, కొత్త వంగడాలు లేకపోవడంతో వేసిన రకాలే వేయడం మరో కారణంగా నష్టాలు మిగుల్చుతున్నాయని చెప్పవచ్చు. ఇందులో ప్రభుత్వమిచ్చే విత్తనమైన నాణ్యంగా ఉంటుందా అంటే అది లేకుండాపోతోంది. దీంతో విత్తన పంపిణీ ఒకప్పుడు జిల్లాలో ఐదు లక్షల క్వింటాళ్ల వరకు ఉండేది. ఇప్పుడు 1.70 లక్షల క్వింటాళ్లకు తగ్గిపోయింది. ఈ విత్తనాన్ని కూడా కొనేందుకు ముందుకు రావడం లేదు. ఎందుకంటే ప్రభుత్వమిస్తున్న విత్తనాల్లో నాణ్యత ప్రశ్నార్థకం అవుతోంది. ఎందుకంటే గతంలో ఇచ్చే విత్తనాల్లో కొంత భాగమైన సర్టిఫైడ్ విత్తనం ఉంటూ వచ్చేది. దీంతో కొంత వరకు నాణ్యమైన విత్తనం లభించేది. కాని ఇప్పుడు ఇస్తున్న విత్తనం పూర్తిగా ట్రూత్‌ఫుల్ లేబుల్డ్ సీడ్. దీని సేకరణ కూడా పూర్తీగా ప్రయివేటు వ్యాపారుల నుంచి ఉంటోంది. మిల్లుల్లో సేకరించిన విత్తనాన్ని ప్రాసెసింగు చేసి, జర్మినేషన్ టెస్టు చేసి రైతులకు అందజేస్తున్నారు. అయితే ఇందులో విత్తన నాణ్యత ఏ పాటిదన్నది ప్రశ్నార్థకమే అవుతోంది. మొలకెత్తే వరకు ఉంటున్నా దిగుబడులు ఏ రకమన్నది అనుమానంగానే ఉంటోంది. దీంతో రైతులు సబ్సిడీ విత్తనం కంటే బయటే నేరుగా రైతులతో చూసి కొనుగోలు చేస్తుకుని విత్తనం వాడుతున్నారు. ప్రభుత్వం అందించే విత్తన కొనాలంటే ఇప్పుడున్న విధానంలో ముందుగానే రైతు తన వాటా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. విత్తనం నచ్చకపోతే అది తిరిగిస్తే డబ్బులు తిరిగి ఎప్పుడు వస్తాయో లేక విత్తనమే తిరిగి ఎప్పుడు అందుతుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది విత్తన పంపిణీకి రంగం సిద్ధమైంది. అయితే విత్తన నాణ్యతపై మాత్రం అనేక ఆరోపణలు వెల్లువెత్తుతతున్నాయి. ట్రూత్‌పుట్ లేబుల్డ్‌లో ఎంత మేరకు విత్తన నాణ్యత ట్రూత్‌ఫుల్‌గా ఉంటుందన్న సందేహాలు నెలకొన్నాయి. అధికారులు మాత్రం మంచి విత్తనాన్ని అందిస్తామని చెబుతున్నారు. కాని విత్తన సేకరణ మాత్రం మొత్తం ప్రయివేటు వ్యాపారులపై ఆధారపడటంతో దీనిపై అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. వచ్చే వారం నాటికి పంపిణీని ప్రారంభించే అవకశాలున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా వేరుశనగ రైతుకు మాత్రం కష్టాలు, నష్టాలు తప్పడం లేదు.

రోడ్డు పనులపై కాంట్రాక్టర్‌తో చర్చిస్తున్న మేయర్ వసీం

అంతర్గత రహదారుల పనులు పూర్తి చేయండి
మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో జరుగుతున్న అంతర్గత రహదారుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మేయర్ మొహమ్మద్ వసీం ఆదేశించారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్‌లో రూ.26 లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ శేఖర్‌బాబుతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే రూ.25 కోట్ల స్పెషల్ గ్రాంట్ విడుదలైనట్లు తెలిపారు. అదేవిధంగా గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయానికి రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారన్నారు. ఆయా నిధులతో నగరంలోని అన్ని డివిజన్ల పరిధిలో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టుల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నగర రూపురేఖలు మారేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శేఖర్‌బాబు, కమల్‌భూషణ్, నాయకులు ఖాజా, డిఇ రాంప్రసాద్‌రెడ్డి, ఎఇ శంకర్, సచివాలయం అమినిటీస్ పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-శింగనమల

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నియోజకవర్గ టాపర్లుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈమేరకు శనివారం బుక్కరాయసముద్రం మండలంలోని ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా శింగనమల మండలానికి చెందిన పొబ్బతి తనూష, చాందినీ, నవ్యకు ప్రశంసాపత్రంతోపాటు శాలువాతో ఘనంగా సన్మానించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైఎస్ఆర్ పురస్కార గ్రహీత శాంతి నారాయణ తాను రచించిన 200 పుస్తకాలను జిల్లాకేంద్రంలోని గ్రంథాలయానికి వితరణ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం శనివారం 13వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు సూర్యనమస్కారాలు, డాన్స్, కథలు చెప్పడం, పుస్తక పఠనం వంటిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమ, రచయిత కొత్తపల్లి సురేష్, సిబ్బంది శివశంకర్‌ప్రసాద్, ఇంతియాజ్ అహమ్మద్, కావేరి, హేమమ్మలిని, ఉజ్జినేస్వారి, తదితరులు. పాల్గొన్నారు.

వేరుశనగ నాణ్యతలో తేడాలొస్తే చర్యలు
జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్

ప్రజాశక్తి-అనంతపురం

విత్తన కాయల నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

రైతులకు సబ్సిడీపై పంపిణీ చేయనున్న వేరుశనగ కాయలు నాణ్యతలో లోపాలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ హెచ్చరించారు. శనివారం నగరంలోని జస్వంత్ సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆకస్మికంగా తనికీ చేశారు. ఇందులో భాగంగా వేరుశనగ షెల్లింగ్, తేమ శాతం, ఫిసికల్ ప్యూరిటీ వంటి ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఒక వేరుశనగ బస్తాను తూకం వేయగా 30.300 కిలోలు వచ్చింది. ఎక్కువ మంది కూలీలతో రోజూ ప్రాసెసింగ్ చేసి జిల్లాలోని ఆర్‌బికెలకు తరలించాలన్నారు. ప్రాసెసింగ్ అయిన విత్తనాన్ని మహిళా కూలీలతో రాళ్లు, పుల్లలను వేరు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ డివిజన్ ఎడిఎ వెంకటరాముడు, సాంకేతిక వ్యవసాయ అధికారి రాకేష్‌నాయక్, అనంతపురం మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్, ప్రాసెసింగ్ యూనిట్ ఇన్‌ఛార్జి అర్చన, ప్రాసెసింగ్ యూనిట్ ఓనర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

రీ సైక్లింగ్ ప్రక్రియకు సహకరించాలి
మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రీసైక్లింగ్ పక్రియకు నగర ప్రజలంతా సహకరించాలని మేయర్ మొహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 24వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీ యూజ్, రీ సైకిల్) సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి డివిజన్‌లో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీ యూజ్, రీ సైకిల్) సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో భాగంగానే ప్రయోగాత్మకంగా నగరంలోని 24వ డివిజన్ పరిధిలోని 40వ సచివాలయంలో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రీసైక్లింగ్ ప్రక్రియకు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్ ఇతర వస్తువులను పెద్ద ఎత్తున సేకరించనున్నట్లు తెలిపారు. సేకరించిన వస్తువులను ఆయా కేంద్రాల్లో రీసైక్లింగ్ చేయనున్నట్లు తెలిపారు. అయితే ప్రజలు భాగస్వాములు అయినప్పుడే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్‌ఛైర్మన్ ఒబిరెడ్డి, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, కమల్‌భూషణ్, డిఇ రాంప్రసాద్‌రెడ్డి, ఎంహెచ్ఒ గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 ప్రోగ్రాంలో మేరీ లైఫ్ మేరీ స్వచ్ఛ షహర్ సాధించడంలో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన రెడ్యూస్ రీ యూస్ రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సెంటర్‌ను కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళుశిల్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు పర్యావరణ దినోత్సవ ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు తమ ఇళ్లల్లోని పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, పుస్తకాలు, పేపర్ అట్టలు, కాగితాలు, దుస్తులను ఆర్ఆర్ఆర్ సెంటర్‌లో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వలిబాషా, 4వ వార్డ్ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ జగదీష్, వార్డు శానిటరీ సెక్రటరీలు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ వసీ, కార్పొరేటర్లు

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కొట్టం శ్రీరాములు కుమారుడు రమేష్ కుటుంబానికి ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు శనివారం రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈయనతోపాటు గ్రామానికి చెందిన నాయకులు రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా నరసానాయుడు మాట్లాడుతూ రమేష్ మృతి చెందడం పార్టీకి తీరని లోటు అన్నారు. రమేష్ జిల్లా సాగిన నారా లోకేష్ పాదయాత్రలో కూడా చురుగ్గా పాల్గొన్నాడన్నారు. అలాంటి రమేష్ మృతిచెందడం బాధాకరమన్నారు. కాగా ప్రభుత్వం రావాల్సిన సదుపాయాలు వచ్చేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, మాజీ ఎంపిటిసి రాఘవనాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పి.నారాయణస్వామి, ఎస్.రామ్మోహన్, మీసాల అదెన్న, ప్రకాష్, నాగేష్, గిత్తల నారాయణస్వామి, తిరుపతయ్య, అదేన్న, కోడె తిరుపతి, చంద్ర, వలి, తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన సంజనారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పాలిసెట్-2023 ఫలితాల్లో బాలికల విభాగంలో ఎం.సంజనారెడ్డి జిల్లాలోనే ప్రథమస్థానం సాధించారు. నగరంలోని లక్ష్మీ సెనర్జీ పాఠశాలలో చదువుతున్న అంజనారెడ్డి పాలిసెట్ పరీక్షలో 117 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ప్రార్థన, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. జిల్లా మొదటి ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం సంజనారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలో 2023-24 సంవత్సరానికి అర్హులైన రైతులు ఉద్యానవన పంటలు సాగు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎపిఒ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద మామిడి, సపోటా, జామ, నిమ్మ, చీనీ, దానిమ్మ, నేరేడు, సీతాఫలం, అంజూరా, డ్రాగన్ ఫ్రూట్, మునగ వంటి పంటలుసాగు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా పంటలు సాగు చేయాలంటే ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి, ఐదెకరాలలోపు పొలం ఉన్న రైతులు అర్హులన్నారు. పంటలు సాగు చేస్తే రైతులకు రెండు, మూడు సంవత్సరాలు తోటల నిర్వహణకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సజావుగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పవిత్ర ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఈ సందర్భంగా మండలంలో ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి హసీనాభాను, ఎంపిడిఒ భాస్కర్‌బాబు, మండల కన్వీనర్ వన్నూరుస్వామి, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పవిత్ర

రాయదుర్గంలో విద్యుత్ కోత
ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే వేసవికాలం దీంతో ఉక్కపోతతో అల్లాడిపోయారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో గార్మెంట్ పరిశ్రమతోపాటు ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, హోటళ్లల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్‌ను వివరణ కోరగా మండలంలోని ఉడేగోళం వద్ద ఉన్న 132 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందన్నారు. తర్వాత పట్టణంలోని 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా పలుమార్లు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. శాశ్వత మరమ్మతుల కోసం అనంతపురం నుంచి ప్రత్యేక నిపుణులు రావాల్సి ఉందన్నారు. త్వరలోనే విద్యుత్ సరఫరా మెరుగుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాల్యవివాహాలను అరికడదాం : ఎంపిపి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బాల్య వివాహాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపిపి దాసరి సునీత పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. లేకుంటే అనేక అనార్థాలకు దారి తీస్తుందన్నారు. ముఖ్యంగా అమ్మాయికి శారీరకంగా, మానసికంగా, ఆరోగ్య పరమైన సమస్యలు ఎదురవుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే స్థానికులు అందరూ కలిసి నిలిపి వేయాలన్నారు. బాల్య వివాహాలు నిలుపుదల కోసం మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, జిల్లా కో ఆర్డినేటర్ నాగేంద్ర పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బాల్య వివాహాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ మాట్లాడుతూ 2006 బాల్య వివాహల చట్టం ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. అలాకాకుండా వయస్సు రాకనే వివాహం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ అధికారులు, వైద్యాధికారులు, అంగన్వాడీలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతిపై అధికారుల విచారణ

ప్రజాశక్తి-అనంతపురం

మృతురాలి భర్తలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారులు

ఇటీవల అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో అబార్షన్ వికటించి మహిళ మృతిచెందిన ఘటనపై వైద్యశాఖ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. సత్యసాయి జిల్లా గుట్టూరు పరిధిలోని అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన పెద్ద సాకే హనుమంతు భార్య కవిత నాలుగు నెలల గర్భవతి కావడంతో అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారలు. అయితే పలు కారణాల కారణంగా అబార్షన్ అయింది. దీంతో చికిత్స వికటించి కవిత మృతిచెందింది. ఈనేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వీరబ్బాయి, జిల్లా నోడల్ అధికారి (పిసిపిఎన్‌డిటి యాక్ట్) డాక్టర్ యుగంధర్ బాధితురాలి గ్రామానికి చేరుకుని భర్తను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అబార్షన్ చేసినందుకు డాక్టర్‌కు రూ.50వేలు చెల్లించానని మృతురాలి భర్త పెద్ద హనుమంతు వాపోయాడు. అలాగే చుట్టుపక్కల వారిని కూడా విచారించగా డబ్బులు ఇచ్చినది వాస్తవేమే అని తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని వైద్యశాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, హెల్త్ డిక్టేటర్ సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, గుట్టూరు మెడికల్ ఆఫీసర్ నాగరాజునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒగా విజయభాస్కర్

బుక్కరాయసముద్రం : మండల నూతన ఎంపిడిఒగా విజయభాస్కర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తేజోష్ణను గార్లదిన్నెకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో గార్లదిన్నెలో ఎంపిడిఒగా పని చేస్తున్న విజయభాస్కర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. దీంతో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

విత్తనకాయలకు 17,887 మంది రిజిస్ట్రేషన్

అనంతపురం : రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందించే వేరుశనగ కాయల కోసం జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో 17,887 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పేర్లు నమోదు చేసుకున్న ప్రకారం 15,805 క్వింటాళ్ల వేరుశనగ కాయలు అవసరం అవుతాయన్నారు.

23న బహిరంగ వేలంపాట

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో కుళ్లాయిస్వామి దర్శనం నిమిత్తం వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ఈనెల 23న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఆనంద రాఘవ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

బాలమురళి బాధ్యతల స్వీకరణ

అనంతపురం సిటీ : జిల్లా సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జి అసిస్టెంట్ అలెస్కోగా బాలమురళి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన అసిస్టెంట్ అలేస్కో రవి ఇటీవల జరిగిన రోడ్డు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆయన మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఆయన స్థానంలో రాప్తాడు మండలం హంపాపురం జడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా పని చేస్తున్న బాలమురళికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ డిఇఒ సాయిరాం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బాధ్యతలు స్వీకరించారు.

జెఎన్‌టియులో కొనసాగిన ఎన్‌బిఎ కమిటీ పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌బిఎ (నేషనల్ బోర్డ్ అఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు ఇవ్వడానికి పీర్ కమిటీ రెండవ రోజు శనివారం కూడా పర్యటించింది. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, అల్యూమిని సభ్యులతో మీటింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ పి.సుజాత తెలిపారు. అలాగే విద్యార్థుల ప్లేస్‌మెంట్ వివరాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి సెల్ వివరాలు, కళాశాలకు సంబంధించిన వివిధ దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సివిల్, కెమికల్ విభాగాలకు సంబంధించిన ప్రయోగశాల, తరగతి గదులు, సిలబస్ రూపకల్పన, ఎన్‌బిఎకు సంబంధించిన వివిధ ఫైళ్లను పరిశీలించారు. అనంతరం బోధన, బోధనేతర సిబ్బందితో మాట్లాడారు. తర్వాత ఎన్‌బిఎ కమిటీ సభ్యులు జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధనను కలిశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, వర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ ఇ.కేశవరెడ్డి, ప్రిన్సిపల్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవాని, కెమికల్ విభాగం అధిపతి దిలీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు గేట్స్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-గుత్తి

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక గేట్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. బెంగళూరులోని సొనాటా అనే ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో కళాశాలలో చదుబుతున్న సీఎస్ఈ, ఈసీఈ విభాగాలకు చెందిన ఆర్షియా, అమ్మాజాన్, కృష్ణతేజ, నవీన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.4 లక్షలు వార్షిక ఆదాయం ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సూరయ్య, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్, హెచ్ఒడిలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

వృద్ధురాలికి 'వశికేరి' సాయం

ప్రజాశక్తి-ఉరవకొండ

వృద్ధురాలికి సాయం చేస్తున్న వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున

పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలు పింజరి లాలెమ్మకు 15వ మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున శనివారం నిత్యావసర సరుకులతోపాటు ఆర్థికసాయం అందజేశారు. లాలెమ్మకు ప్రభుత్వం ద్వారా నెలనెలా పింఛను వస్తుంది. అయితే ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బంధువుల ఇంటికి వెళ్లింది. ఈనేపథ్యంలో ఈనెల వచ్చిన పింఛను ఇవ్వడానికి వాలంటీర్లు ఆమె ఇంటికి వెళ్లగా తలుపులు వేసింది. 5వ తేదీ వరకు గాలించినా అందుబాటులో లేకపోవడంతో పింఛను సొమ్మును వెనక్కి పంపారు. దీంతో పింఛన్‌తోనే బతుకుతున్నాని సచివాలయ సిబ్బందితో మొరపెట్టుకుంది. ఆసమయంలో అక్కడే ఉన్న వార్డు సభ్యులు మల్లికార్జున స్పందించి ఈనెలకు మంజూరైన రూ.2,750 మొత్తంతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి నరసింహులు, ఎంపిడిఒ చంద్రమౌళి, 5వ సచివాలయ కార్యదర్శి పవన్, వెల్ఫేర్ అసిస్టెంట్ శంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న దిడ్డి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఆత్మహత్య చేసుకున్న వృద్ధుడి ఆచూకీ లభ్యమైంది. నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న వృద్ధుడి మతదేహం శుక్రవారం లభించడం పాఠకులకు విధితమే. కర్ణాటక రాష్ట్రంలోని పావగడ పట్టణం వినాయక నగర్ కు చెందిన చిన్న పాపన్నగా పోలీసులు గుర్తించినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అందజేసినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం తగిలి జింక మృతి

ప్రజాశక్తి : మండలంలోని బొమ్మలాటపల్లి మిట్ట వద్ద గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో జింక మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. బొమ్మలాటపల్లి వద్ద వాహనం ఢీకొనడంతో ఓ జింక తీవ్రంగా గాయపడింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఏఎస్ఐ ఈశ్వరయ్య, కానిస్టేబుళ్లు అనిల్, రాజు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన జింకను పశు వైద్య శిబిరానికి తరలించారు. అయితే అప్పటికే జింక మృతి చెందినట్లు పశు వైద్యులు తెలిపారు. ఘటనపై ఫారెస్ట్ అధికారులకి తెలియజేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.